క్లుప్తంగా

హరిహరక్షేత్రంలో 16 నుంచి ధనుర్మాస వేడుకలు

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు ధనుర్మాస వేడుకలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆలయ అర్చకులు తెలిపారు. బుధవారం చీమకుర్తిలో శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులతో పాటు ఆలయ సిబ్బంది ధనుర్మాస వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు.

బోరు సామగ్రి చోరీ

మద్దిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న గదిలో ఉంచిన రూ.45 వేల విలువైన బోరు సామగ్రిని అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గది తాళం పగలగొట్టి సామగ్రి అపహరించినట్లు సోమవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది గమనించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

చీమకుర్తి: చీమకుర్తిలో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం జిల్లాస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనీఫ్ పిలుపునిచ్చారు. బుధవారం చీమకుర్తిలో సీపీఎం కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు షేక్ మాబు, పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం


శ్లోకాలు పఠిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: గీతా జయంతి పర్వదినాన్ని బుధవారం మార్కాపురం పట్టణంలోని అమ్మవారిశాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి ఇస్కాన్ ప్రతినిధి ప్రభుదాస్ బృందం ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాలు, మహాభారత అధ్యాయాలను భక్తులతో పారాయణం చేయించారు. భగవద్గీత విశిష్టత, ఆధ్యాత్మిక జ్ఞానం ఎలా పొందవచ్చో వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 108 మందికి భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఏకాదశి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

గిద్దలూరు రూరల్: గీతా జయంతి సందర్భంగా బుధవారం గిద్దలూరులోని కుసుమ హరనాథ స్వామి మందిరం ఆవరణలో భక్తులు గీతాపారాయణం చేశారు. భగవద్గీతలోని 700 శ్లోకాలను పఠించారు. ప్రతి ఒక్కరు గీతలోని సారాంశాన్ని గ్రహించి జీవితాన్ని ఆనందదాయకం చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్తలు సూచించారు.

శిక్షణకు సర్పంచ్‌లు డుమ్మా

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గత రెండు రోజులుగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు డుమ్మాకొట్టారు. మండలంలోని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, విలేజ్ సర్వేయర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట సమయంలో అరకొరగా వచ్చిన సర్పంచ్‌లు సంతకం పెట్టి వెళ్లిపోయారు. సర్పంచ్‌లు లేకుండానే మిగిలినవారికి ఎంపీడీఓ ఎ.రంగనాయకులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!

- విద్యుత్ స్తంభాలను చుట్టేసిన పిచ్చిచెట్లు
- ఏకంగా స్తంభాలే కనిపించకుండా పొంచి ఉన్న ప్రమాదాలు
- స్పందించని విద్యుత్ అధికారులు, సిబ్బంది

చీమకుర్తి రూరల్: విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. వర్షాలు కురిసినప్పుడే కాకుండా ఇతర సమయాల్లో సైతం తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతుండటంతో పాటు పెనుగాలులు వీచినప్పుడు విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అయినప్పటికీ.. ఆ శాఖ అధికారులు, సిబ్బందిలో ముందుచూపు కరువైంది. చీమకుర్తి మండలంలోని గ్రామాల్లో అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలకు పిచ్చిచెట్లు అల్లుకుపోయాయి. కొన్నిచోట్లయితే అసలు అక్కడ విద్యుత్ స్తంభం ఉన్నట్లే కనిపించడం లేదు. విద్యుత్ స్తంభాలను పచ్చని చెట్ల తీగలు కింది నుంచి పైవరకూ అల్లేశాయి. వీటివలన గాలివీచినా, వర్షం కురిసినా విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తుతోంది. పడమటినాయుడుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో చీమలమర్రి వద్ద ఒంగోలు–కర్నూలు రోడ్డుకు రెండు వైపులా ప్రధాన విద్యుత్ లైన్లలోని స్తంభాలను పచ్చని పొదలు చుట్టేశాయి. అయినప్పటికీ ఆ శాఖ సిబ్బంది వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గాలి వీచినా, వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఈ లైన్ ద్వారానే మండలంలోని పడమటినాయుడుపాలెం, బండ్లమూడి, అగ్రహారం, తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు, మంచికలపాడు, చీమలమర్రి, రెడ్డినగర్ వరకూ విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఆయా గ్రామాల పరిధిలోని మరికొన్ని విద్యుత్ స్తంభాలను కూడా పిచ్చిచెట్ల తీగలు అల్లుకుని ఉన్నాయి. వాటివలన ఏ ఒక్క గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా.. ఈ లైన్లోని మిగిలిన అన్ని గ్రామాలకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అంతేగాకుండా పచ్చటి తీగలు అల్లుకుని విద్యుత్ స్తంభాలే కనిపించనందువలన వర్షాల సమయంలో విద్యుత్ షాక్ తగిలి పశువులు మృతిచెందుతున్నాయి. దీంతోపాటు మండలంలోని మారుమూల గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నా మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది స్పందించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి విద్యుత్ స్తంభాలు, వైర్లను అల్లుకున్న పిచ్చిచెట్ల తీగలను తొలగించాల్సిన అవసరం ఉంది. తద్వారా మెరుగైన విద్యుత్ సరఫరాపై శ్రద్ధ చూపించాలని ప్రజలు కోరుతున్నారు.


చీమలమర్రి నుంచి రెడ్డినగర్ వెళ్లే విద్యుత్ లైన్‌లో స్తంభాన్ని అల్లుకున్న తీగలు


చీమలమర్రి వద్ద ప్రధాన విద్యుత్ లైన్‌లోని స్తంభాన్ని అల్లుకున్న తీగలు

విద్యుత్ సమస్యతో ఇబ్బందులు

మంచికలపాడు సచివాలయం పరిధిలో విద్యుత్ లైన్‌మన్ లేకపోవడం వలన తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతులు చేయడం లేదు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే మంచికలపాడు సచివాలయం పరిధిలో ఒక లైన్‌మెన్‌ను నియమించాలి.

– పెరికల నాగేశ్వరరావు, సర్పంచ్, మంచికలపాడు

పీఓలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం


సంతనూతలపాడు : మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి


నాగులుప్పలపాడులో ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

మద్దిపాడు: నీటి సంఘాల ఎన్నికలను ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో పీఓలు, ఏపీవోలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సుజన్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు నిర్వహించాల్సిన విధులను వివరించారు. విధులను ఎలా నిర్వహించాలి, ఫారాలు ఏ విధంగా పూర్తి చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ రఫీ, పీఓలు, ఏపీవోలు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: నీటి సంఘాల ఎన్నికలపై అధికారులకు మండల స్థాయిలో స్థానిక హైస్కూల్లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 18 నీటి సంఘాలు, 180 టీసీలకు సంబంధించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈవో, ఏఈఓ, పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 14వ తేదీ మండలంలో నీటి సంఘాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు జరగనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 18 నీటి సంఘాల పరిధిలో 18,827 మంది రైతు ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ తెలిపారు. 12 మేజర్ నీటి సంఘాలు గుడిపాడు, సంతనూతలపాడు, గుమ్మలంపాడు, చిలకపాడు, మంగమూరు, మైనంపాడు, రుద్రవరం, మైనంపాడు, పేర్నమిట్ట, ఎండ్లూరు పరిధిలో ఉన్నాయన్నారు. సంతనూతలపాడు, ఎండ్లూరు, మైనంపాడు, గుమ్మలంపాడు, ఎనికపాడు, మద్దులూరు గ్రామాల పరిధిలో ఆరు మైనర్ నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఈ నీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. ప్రతి ఒక్క రైతూ గుర్తింపు కార్డు తీసుకొచ్చి ఓటు వేయాలన్నారు. శిక్షణ తరగతులలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఏఓ పి.పావని, పంచాయతీరాజ్ ఏఈ వీరాంజనేయులు, ఎస్‌ఎస్పీ ఏఈఈలు షేక్ కరీముల్లాబాషా, రమణారెడ్డి, అనూష, ప్రియదర్శిని, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కె.మాబు సుభానీ, ఈవో, ఏఈఓ, పీఓ, ఏపీవోలు పాల్గొన్నారు.


మద్దిపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పీఓలు, ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. అమ్మనబ్రోలుకు సంబంధించి ఆరు టీసీలు, తిమ్మసముద్రం–1కి సంబంధించి 12 టీసీలు, తిమ్మసముద్రం–2కు సంబంధించి 12 టీసీలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. అమ్మనబ్రోలుకు ఎంపీడీఓ వై.మహాలక్ష్మి, తిమ్మసముద్రం–1కు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తిమ్మసముద్రం–2కు డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల నిర్వహణకు సచివాలయ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దిపాడు: ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారిని ఇవాంజెలిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు మండలంలో (జనరల్), చీమకుర్తి పరిధిలోని చంద్రపాడు–1 (జనరల్), ఆర్‌ఎల్ పురం–2 (ఎస్సీ), నాగులుప్పలపాడు మండల పరిధిలోని టి.అగ్రహారం (జనరల్) అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. హెల్పర్ పోస్టులకు సంబంధించి మద్దిపాడు మండలంలోని నేలటూరు–1 (జనరల్), పెద్దకొత్తపల్లి (జనరల్), దొడ్డవరం–3 (జనరల్), సంతనూతలపాడు మండల పరిధిలోని కొనగానివారిపాలెం (జనరల్), గానుగపాలెం (జనరల్), మంగమూరు–3 (ఎస్సీ), బొడ్డపాటివారిపాలెం (ఎస్సీ), గొర్లమిట్ట (జనరల్), చీమకుర్తి మండల పరిధిలోని కొత్తమంగలిపాలెం (జనరల్), కె.వి.అగ్రహారం (ఎస్సీ), నేకునాంబాద్ (ఎస్సీ), పల్లామల్లి–2 (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఒంగోలు టౌన్: దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ ప్రకాశం జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని గాంధీనగర్‌లో గల భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఉదయం జోన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లా వెనుకబడి ఉండటంతో చేసేందుకు పనులు లేక వందలాది మంది వలసలు పోతున్నారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు బడ్జెట్లో కేటాయించిన నిధులు సరిపోవని, వెంటనే జిల్లా ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి సమాలోచనలు జరిపి తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు తెచ్చుకునేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో చీమకుర్తిలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌డీ హుసేన్, బీవీ రావు, షేక్ పీరు, దాసు, గురవయ్య, షేక్ జబ్బార్, జానీ బాషా, రావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రెవెన్యూ సదస్సుకు 35 అర్జీలు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుంచి 35 అర్జీలు అందాయి. పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వే కొలతల కోసం అధికంగా అర్జీలు వచ్చాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలకు సంబంధించి రైతులు అందించిన అర్జీలను సత్వరమే పరిష్కరించనున్నట్టు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించగా, ఉప సర్పంచ్ గుండవరపు సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆళ్ల ఆంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామ్‌తేజ్, వీఆర్వో పి.మధు, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, కంప్యూటర్ ఆపరేటర్ ఐ.నాగేశ్వరరావు, ఎండోమెంట్ ఈవో నారాయణరెడ్డి, సీపీఎం నాయకుడు కే పెద్దబ్బాయి, రైతులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

చీమకుర్తి రూరల్: మండలంలోని ఆర్‌ఎల్ పురం గ్రామంలో న్యూ కవనెంట్ టెంపుల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి మత్తయ్య దైవ సందేశం అందించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకూ ప్రపంచమంతా ఏసు క్రీస్తు పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటారని తెలిపారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పాస్టర్ యోహాన్, ఎంపీటీసీ వంకాయలపాటి అహరోను, సంఘస్తులు, యవ్వనస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.


సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సంఘ కాపరులు

గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పోటీలు


భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: విశ్వహిందూ పరిషత్, గీతామందిరం సంయుక్త ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కోటి గొంతులతో గీతా పఠనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. మాంటిస్సోరి కరస్పాండెంట్ ప్రకాష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఘనంగా రథోత్సవం


సాయినాథుడు, దత్తాత్రేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: షిరిడీసాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో 34వ వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ఆలయ అర్చకులు షిరిడీ సాయినాథునికి, దత్తాత్రేయునికి సుగంధ పరిమళద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. స్వామివారి అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు దత్తాత్రేయునికి, సాయినాథునికి మందిర ప్రాంగణంలో వేద పురోహితుల ఆధ్వర్యంలో వేదమంత్ర పఠనం, రథోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.


వేదమంత్ర పఠనంలో వేద పురోహితులు

కష్టం నీటిపాలు.. రైతన్నకు కన్నీళ్లు

పప్పుశనగ రైతులను నిండా ముంచేసిన ఫెంగల్ తుఫాన్

- గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 4 వేల ఎకరాల్లో పంట నష్టం
- ఉరకెత్తిన పొలాల్లో పంట మొత్తం ఎండుముఖం పడుతున్న వైనం
- ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతుల ఆవేదన


కొత్తపల్లెలో పూర్తిగా కుళ్లిపోయిన పప్పుశనగ పంటను చూపుతున్న రైతులు

బేస్తవారిపేట:

ఫెంగల్ తుఫాన్ పప్పుశనగ రైతులకు తీవ్ర నష్టం, తీరని వేదన మిగిల్చింది. ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో పొలాలను ముంచెత్తిన నీరు పంటలను ఉరకెత్తేలా చేసింది. రైతులు ఆందోళన చెందినట్టుగానే పప్పుశనగ పంట కుళ్లి, పనికిరాకుండా పోయింది. వర్షాలు తగ్గి, పొలాల్లో తేమ ఆరేకొద్దీ పంట ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేస్తవారిపేట మండలంలోని ఆర్.కొత్తపల్లె, పూసలపాడు గ్రామాల్లో దాదాపు 120 ఎకరాల్లో పప్పుశనగ పంట వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గిద్దలూరు మండలంలోని అంబవరం, వెల్లుపల్లె, సంజీవరాయుడుపేట, ముండ్లపాడు, ఓబులాపురం, ఉయ్యాలవాడ, కె.ఎస్.పల్లె తదితర గ్రామాల్లో సుమారు 1800 ఎకరాల్లో పప్పుశనగ దెబ్బతింది. రాచర్ల మండలంలోని అనుములవీడు, గౌతవరం, అనుములపల్లె, గంగంపల్లె, రాచర్ల గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కొమరోలు మండలంలో మండలంలో పప్పుశనగ పంట మూడొంతులకు పైగా దెబ్బతింది. ఈ మండలంలోని పలు గ్రామాల్లో 300 ఎకరాల్లో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన శనగ విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కురిసిన వర్షం.. అరకొరగా మొలిచిన మొక్కలను కూడా తుడిచి పెట్టేసింది. కంభం, అర్ధవీడు మండలాల్లోనూ శనగ రైతులు నష్టపోయారు.

పెట్టుబడి నీటి పాలు

వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పప్పు శనగ ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. క్వింటా పప్పుశనగ విత్తనాలకు రూ.7500, సేద్యానికి రూ.5 వేలు, విత్తనాలు విత్తేందుకు రూ.5 వేలు, పురుగుమందులు, బలం మందులకు రూ.5 వేలు, కౌలుకు రూ.5 వేలు.. ఇలా ఎకరాకు రూ.20–రూ.27 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో పెట్టుబడి మొత్తం నీటిపాలైందని, అప్పులపాలవు

పరిహారంపై దిగులు

రబీ సీజన్‌కు సంబంధించిన ఈ క్రాప్ నమోదును గిద్దలూరు నియోజకవర్గంలో ఇటీవలే ప్రారంభించారు. ఈ క్రాప్ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సాగనుంది. అయితే శనగ సాగు చేసిన నెల రోజులకే వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో దున్నేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పంట నష్టం మంజూరుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనగ దెబ్బతిన్నందున గ్రామాలను యూనిట్‌గా తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం శనగకు ఇన్సూరెన్స్ ప్రీమియం ఎకరాకు రూ.368గా నిర్ణయించడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా చేసిన విషయాన్ని గుర్తు చేసుకుని కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్నారు. రబీ పంటల ఇన్సూరెన్స్ ప్రీమియం గడువు కూడా ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. ఇప్పటికీ వేలాది మంది రైతులు ప్రీమియం చెల్లించేందుకు విముఖత చూపుతున్న నేపథ్యంలో నష్ట పరిహారంపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఈ క్రాప్ బుకింగ్ చేస్తూనే, ఎన్యుమరేషన్ పూర్తి చేయడం కష్టమవుతుందని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందేనని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.